తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం  సూర్యాపేట  యాదాద్రి భువనగిరి
సోమవారం
15 జూన్ 2026
పేజీలు : 8

## నేడు పునః ప్రారంభం కానున్న
# పాఠశాలలు

**భాష ఒక ఆయుధం ఎవరు సొత్తు కాదు సాధన చేస్తే**

**ప్రచారం లేని ప్రతిభ చీకట్లో ఉన్న దీపం లాంటిది..**

**ప్రైవేట్ పాఠశాల గొప్పది కాదు.. ప్రభుత్వ వ్యవస్థ బలహీనమైనది..**

**టెక్నాలజీ ప్రదర్శన కోసం కాదు.. నైపుణ్యం కోసం..**










**మణుగూరు, జూన్ 14 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలో చదవటానికి తల్లిదండ్రులు విద్యార్థులు ఆసక్తి చూపక పోవడానికి అనేక కారణాలు ఉన్నాయి ముఖ్యంగా మౌలిక వసతుల లోపం ఉపాధ్యాయుల కొరత ఆంగ్ల విద్యలో బోధన చేయడంలో శ్రద్ధ లేకపోవడం ఆంగ్లంలో పట్టు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. సమయపాలన, క్రమశిక్షణ లేకపోవడం వల్ల హాజరు శాతం తగ్గుతోంది. లక్షల్లో జీతాలు వెచ్చిస్తున్న ప్రభుత్వం ఆంగ్లంలో బోధించడం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహణ లేక వృత్తి పై ఆసక్తి తగ్గి నిరుత్సాహానికి గురవుతున్నారు. నిరక్షరాశులైనా కొంతమంది ఎన్ని భాషలైనా మాట్లాడుతారు.. కానీ రాయలేరు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఆంగ్లంలో బోధించడానికి ఎందుకు ప్రయత్నం చేయలేకపోతున్నారు...? వారికి అంత సమయం లేదు.! ఎందుకంటే అదనపు ఆదాయం కోసం రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఆన్లైన్ వ్యాపారాలు చేయటానికి ఇష్టపడుతున్నారు. ప్రభుత్వ ద్వారా జీతం తీసుకుని ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడానికి ఎందుకు ఆసక్తి చూపటం లేదని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ఉద్యోగుల్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాలు కొంతకాలం పనిచేస్తాయి అదే విద్య వైద్య రంగానికి నిధులు కేటాయిస్తే కొన్ని తరాలకు ఉపయోగపడుతుందని భావన ప్రభుత్వానికి రావాలి. అప్పుడే పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరుగుతోంది.

**ఉచితాలతో ఉపయోగం లేదు :**

ఉచిత విద్య ,పుస్తకాలు ,యూనిఫామ్ ,మధ్యాహ్న భోజనం స్కాలర్షిప్ లాంటివి అమలు చేసినా తల్లిదండ్రుల విద్యార్థులను ఆకట్టుకోలేకపోతున్నారు. నాణ్యమైన విద్య మౌలిక వసతులు లేకపోవడమే సమస్యగా మారింది.. ప్రైవేటు పాఠశాలలు ఫ్యాన్సీ యూనిఫామ్స్ స్మార్ట్ క్లాసులు ఆంగ్లంలో మాట్లాడే వాతావరణం చూపించి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో పదిమంది ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి 15 వేల జీతాలు ఇచ్చి స్వచ్ఛమైన తాగునీరు టాయిలెట్స్ శుభ్రంగా చూపి అధిక పీజులు వసూలు చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడం శిధిలావస్థలో ఉన్న భవనాలు దర్శనం ఇవ్వటం కనీసం ఫ్యాన్లు ట్యూబ్ లైట్లు లేకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు, తల్లిదండ్రులకు శాపంగా మారింది.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు లక్షల్లో జీతాలు తీసుకొని ఆంగ్ల బోధన చెయ్యకపోవడం పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.. వీరికి జీతాలు పెంచటంలో ఉన్న శ్రద్ధ పాఠశాల నిర్వహణ, మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఎందుకు అశ్రద్ధ చూపుతోంది. 15 వేలకే ప్రైవేటు పాఠశాలలో ఆంగ్లం బోధిస్తుంటే లక్షల్లో జీతాలు తీసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎందుకు బోధించడం లేదు.. ఏ ప్రభుత్వమైనా విద్య వైద్యానికి పెద్ద పీట వేస్తుంది కానీ వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ పాఠశాలలో పంపలేక ప్రవేట్ పాఠశాలలో చదివించలేక అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు..

**పాఠశాలలకు నిధుల కొరత :**

ప్రభుత్వ పాఠశాలలకు సమగ్ర శిక్ష , పిఎం పోషణ (మధ్యాహ్న భోజనం) తెలంగాణ రాష్ట్ర నిధులు, మన ఊరు మనబడి, పాఠశాల గ్రాంట్ , ఉచిత పుస్తకాలు ఏకరూప దుస్తులు ఇలా ఎన్నో పథకాల ద్వారా నిధులు మంజూరు అవుతున్నాయి.. నిధులు వస్తున్నాయి వాటికి సరైన పర్యవేక్షణ లేకపోవడం ఆలస్యంగా నిధులు రావడం పూర్తిగా వినియోగం కాకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాల అంటే ఇంతే అనే ఆలోచనకు వస్తున్నారు. అన్ని వసతులు కల్పిస్తే మేమెందుకు చేయమని చెబుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్స్, పాఠశాల పరిశుభ్రత, విద్యుత్తు బిల్లులు, తాళాలు, తలుపులు, బ్లాక్ , డిజిటల్ బోర్డులు వీటికి తక్షణమే బిల్లులు చెల్లిస్తే సమస్య తగ్గినట్టే ..కానీ ప్రభుత్వం ప్రజాప్రతినిధులు వీటిపై దృష్టి పెట్టకపోవడం వల్ల అటు ఉపాధ్యాయులు ఇటు తల్లి తండ్రులు అసంతృప్తికి గురవుతున్నారు.

**ముగింపు :**

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం రావాలంటే వ్యవస్థలో మార్పు రావాలి, ఉపాధ్యాయ నియామకాలు జరగాలి. భోజనం తప్ప ఇతర డ్యూటీల నుంచి విముక్తి చేయాలి. ఉపాధ్యాయ శిక్షణ తరగతులు నిర్వహించాలి. పక్కా భవనాలు మౌలిక సదుపాయాలు కల్పించాలి. తల్లిదండ్రులను పాఠశాలకు భాగస్వాములుగా చేయాలి. నిధుల వినియోగంపై పారదర్శకత, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయాలకు ప్రచారం. ప్రభుత్వ పాఠశాల బలపడితే పేదోడు బలపడుతాడు పేదోడు బలపడితే దేశమే బలపడుతోంది. ఇప్పటికైనా మార్పు రాకపోతే రేపు విద్య హక్కు కాదు. విద్య వ్యాపారమై పేద మధ్య తరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మిగులుతోంది.

# చదువుతో పాటు భద్రత ముఖ్యం

## ○విద్యార్థులకు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచనలు



**నల్లగొండ ప్రతినిధి, జూన్14,(జనం సాక్షి):** కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులకు నల్గొండ జిల్లా పోలీసు శాఖ తరఫున జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శు భాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు విద్యా భ్యాసంతో పాటు భద్రత, బాధ్యతాయుత ప్రవర్తనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టులు ఉపయోగించాలని సూచించారు. వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నివారించాలని తెలిపారు. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్లు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఏవైనా సైబర్ నేరాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, పొగాకు, మద్యం వంటి హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చెడు అలవాట్లు, తోటి విద్యార్థుల ఒత్తిడికి లొంగకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పరస్పర గౌరవం, దయ, సహానుభూతి, సమానత్వ భావనతో వ్యవహరించాలని, వేధింపులు, వివక్ష, ఇతరులను బాధించే ప్రవర్తనకు దూరంగా ఉండాలని కోరారు. చదువు, వ్యాయామం, వినోదం, విశ్రాంతికి సమాన ప్రాధాన్యత ఇచ్చే సమతుల్య జీవనశైలిని పాటించాలని తెలిపారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగుతూ కష్టపడి చదవాలని, సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకాంక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, బాలల సహాయ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930లను సంప్రదించాలని సూచించారు. అలాగే మాదక ద్రవ్యాల సమాచారాన్ని అందించేందుకు నల్గొండ జిల్లా యాంటీ డ్రగ్ టోల్ ఫ్రీ నంబర్ 8712670266 అందుబాటులో ఉందని తెలిపారు.

# గిరిజన మహిళపై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి



**తిరుమలాయపాలెం, (జనంసాక్షి) :** వారం రోజుల క్రితం తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన పేరం రత్తమ్మ అనే గిరిజన (ఎరుకలి) మహిళను ఏ కారణం లేకుండా దాడి చేసి కుడి చేయి విరగ్గొట్టిన బోళ్ల సంధ్య, గణేష్, లలిత, లక్ష్మయ్య, కిరణ్, ఫుల్ గుజ్జు సుమంత్, భద్రమ్మలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ( ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు ఆవుల వెం కటేశ్వర్లు. గుండమల రామయ్య. పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య. ఏఐపీకేఎంఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధిత పేరం రత్తమ్మని పరామర్శించి ఖండించినారు. ఆమెకి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లతో మాట్లాడి ఆమెపై దాడి చేసిన పై వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని గిరిజన మహిళలకు భద్రత కల్పించా ల్సిందిగా కోరారు. రత్తమ్మ భర్త హరినాథ్ సిపిఐ ఎంఎల్ (ప్రజాపంద) ఏర్పాటు చేయడంలో బీరోలు గ్రామంలో ఆనాటి నాయకులు దారమళ్ళ ముత్తయ్య, పేరం దశరథ, కోదండం. పట్టాభి. అమరులు పూసలి నారాయణ, సోమనబోయిన సోమయ్య లతో కలిసి దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన కుటుంబంపై అకారణంగా దాడి చేయటానికి సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తూ ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని వారు అన్నారు.

# నేటి నుండి ప్రారంభం కానున్న పాఠశాలలు

## ○చెరువుగట్టులో సోమవారం అమావాస్య ○భువనగిరి బస్టాండ్ లో కిటకిటలాడిన ప్రయాణికులు

**యాదాద్రి, కరెస్పాండెంట్ జూన్ 14 (జనంసాక్షి)**
ఒకవైపు నెల 15 రోజుల అనంతరం సోమవారం నుండి పాఠశాలలు ప్రారంభం కానుండడం మరోవైపు సోమవారం అమావాస్య కావడంతో చెరువుగట్టుకు వెళ్లే భక్తులు, ప్రయాణికులతో భువనగిరి బస్టాండ్ కిటకిటలాడింది. ఈనెల 12 ప్రారంభం కావలసిన పాఠశాలలు 13న రెండవ శనివారం 14న ఆదివారం కావడంతో 15వ తేదీ సోమవారం పాఠశాలలో పున ప్రారంభం కానున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థులు, తల్లిదండ్రులు తిరిగి తమ ప్రాంతాలకు ఆదివారం చేరుకునేందుకు బస్టాండ్ ల వద్దకు రావడం, ఇదే సందర్భంలో చెరువుగట్టు ఆలయంలో భక్తులు సోమవారం అమావాస్యని ఎంతో పవిత్రంగా భావిస్తూ ఉండడంతో పెద్ద ఎత్తున భక్తులు చెరువుగట్టుకు ప్రయాణం కావడంతో భువనగిరి బస్ స్టాండ్ లో ఎటు చూసినా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, భక్తులు, ప్రయాణికులతో నిండిపోయింది. ఒక దశలో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికుల మధ్య తోపులాట జరుగుతుందని గమనించి బస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న స్థానిక పోలీసులు



ప్రయాణికులను కంట్రోల్ చేస్తూ బస్సులలో ఎక్కేందుకు సహకరించడంతో పలువురు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఆశ వర్కర్లకు ప్రతి నెల ఒకటవ తారీఖున పారితోషకాలు చెల్లించాలి

**నాంపల్లి,జూన్ 14 (జనం సాక్షి)**
తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం నాంపల్లి మండల కేంద్రంలో నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్ కి ఆశ వర్కర్స్ యూనియన్ నాంపల్లి మండల కేంద్రానికి చెందిన ఎదుళ్ళ సునీత ఎదుళ్ళ కవిత వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లు 28 వేల మంది 20 సంవత్సరాల నుండి గ్రామీణ ప్రాంతాలలో ప్రజా ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల జీవితాలు బాధాకరంగా ఉన్నాయని సేవలందించిన కనీస వేతనాలు లేక టైం కు జీతాలు రాక పిల్లల చదివించుకోలేని స్థితి ఇల్లు గడవని స్థితిలో ఆశ వర్కర్లు ఇబ్బందులకు గురవుతున్న సేవలు చేస్తూనే కాలం గడుపుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వాలు మారుతా ఉన్న కనీసం వచ్చే పారితోషికం ప్రతినెలా ఒకటో తారీఖున వచ్చేటట్టుగా చూడటం లేదని ఆ వేతనమైన కనీసం ఫస్టు తారీకు వచ్చేటట్టుగా చూడాలని కనీస వేతనం ఆశ వర్కర్లకు 18000 ఇవ్వాలని అదేవిధంగా 2022 నుండి 2025 వరకు లెప్రసీ సర్వే, పల్స్ పోలియో ఎలక్షన్ డ్యూటీ లో డబ్బులు ఇంతవరకు చెల్లించలేదు తక్షణమే పెండింగ్ డబ్బులు చెల్లించాలని ఇతర డిమాండ్లతో కూడిన వినతి పత్రం సర్పంచ్ ఇవ్వడం జరిగింది . ఈ సమస్యలు రాష్ట్ర కమిటీ ప్రజాప్రతినిధులకి అందరికీ ఇవ్వాలని ఒక నిర్ణయం చేసిందని సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యురాలు కోరే లలిత, ఎదుళ్ళ కవిత పాల్గొన్నారు.

# రాజకీయ శిక్షణ తరగతులు కమ్యూనిస్టు ఉద్యమానికి బలనీ


### - సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు

**మునగాల, జూన్ 14(జనంసాక్షి):**
రాజకీయ శిక్షణ తరగతులు కమ్యూనిస్టు ఉద్యమానికి బలనీ అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో జరిగిన సిపిఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదం ఇరాక్ పైన యుద్ధం, ఇజ్రాయిల్ దాడులు చేస్తూ తమ ఆధిపత్యాన్ని చలాయించాలని చూస్తుందన్నారు. ఇవాళ భారతదేశంలో బిజెపి మతోన్మదానికి తోడుగా అమెరికాకు అడుగులు మడుగులు ఒత్తుతూ ఈ దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టే స్థితిలో ఉన్నదని ఎద్దేవా చేసారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం వాగ్దానాలు చేసి అమలు చేసే విషయంలో చిత్తశుద్ధి లేదని అన్నారు. అందుకనే వీటన్నిటికి వ్యతిరేకంగా మునగాల మండల సిపిఎం పార్టీ తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వారసత్వంగా పార్టీ సభ్యుల రాజకీయ క్లాసులు ఉపయోగపడతాయని అన్నారు. క్లాస్ టీచర్ రమేష్ దేశ చరిత్రలో కమ్యూనిస్టుల పాత్ర స్వాతంత్ర ఉద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర, భూమికోసం భుక్తి కోసం ఎట్టి చాకిరి విముక్తి కోసం ఈ ప్రాంతంలో తెలంగాణ రైతాంగ పోరాటం జరిగిన తీరును, స్వాతంత్రం వచ్చిన తరువాత దున్నేవానికి భూమి కావాలని సాధించటం కోసం కమ్యూనిస్టులు సాగించిన పోరాటాన్ని తెలియజేస్తూ క్లాసును బోధించడం జరిగింది. సిపిఎం పార్టీ జిల్లా సెక్రెటరీ సభ్యులు ములకలపల్లి రాములు మతోన్మాదం, దాని పరిణామాలు గురించి బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జె విజయలక్ష్మి, బచ్చలకూర స్వరాజ్యం, షేక్ సైదా, మండల కమిటీ సభ్యులు బి కృష్ణారెడ్డి, చందా చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, వెంకన్న, శాఖ కార్యదర్శి సరికొండ నాగరాజు, వెంకట్ రెడ్డి, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# వాకర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**జనంసాక్షి, మిర్యాలగూడ :**
పట్టణం లోని జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆదివారం నాడు గుడపూరి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ ఈసమావేశంలో అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులు గా కన్నెబోయిన వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి కుర్ర కృష్ణ కాంత్ నాయక్,కోశాధికారి అడావత్ చిన వెంకన్న,ఉప అధ్యక్షులు జానకి రామ్ రెడ్డి, వెంకటరత్నం,సంయుక్త కార్యదర్శులు పులి శ్రీనివాస్ గౌడ్, నామ రత్న కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, మిర్యాలగూడ మండల విద్యాధికారి ధీరావత్ ధర్మానాయక్, సమగ్ర శిక్ష జిల్లా గణాంక అధికారి మాలోత్ బాలాజీ నాయక్ వ్యవహరించి, ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన బాధ్యులను అసోసియేషన్ సభ్యులు,వాకర్స్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ మునిర్, వడ్డే రాజు, సుధాకర్, నరేందర్ గౌడ్, నాగేశ్వరరావు, మట్టా రెడ్డి, సైదులు, మల్లయ్య, ఇద్దయ్య, మహిళా ప్రతినిధి రాజీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.










# వ్యవసాయాన్ని రక్షించుకుందాం ?

## రైతు వ్యతిరేక విధానాలను ఎండగడదాం

## అఖిల భారత రైతు కూలి సంఘం

**చంద్రుగొండ, జూన్ 14 (జనం సాక్షి):**
చంద్రుగొండ మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలి సంఘం మండల కమిటీ సమావేశం ధారావత్ బాలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎస్.కే. ఉమర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. విద్యుత్ చట్టం, స్మార్ట్ మీటర్ల అమలుతో రైతులు, పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. విత్తన చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. వరి ధాన్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా, విత్తనాలను సొసైటీలు, రైతు వేదికల ద్వారా రైతులకు అందించాలని కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వరి కోటి వెంకటరావు, ఇస్లావత్ ధన్య, బానోత్ బద్రు, ఆర్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలతో అన్నదాతకు ముప్పు తనిఖీలు చేయని అధికారులు




**ప్రారంభం కానున్న రబీ సీజన్**
**ఆందోళనలో రైతాంగం**
**దుకాణాలపై నిఘా కరువవడంతో**
**అక్రమార్కులకు రెక్కలు**

**పెద్దవూర, జూన్ 14 జనంసాక్షి**
రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభానికి సమయం ఆసన్నమవుతుండటంతో రైతన్నలు సాగు పనులకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా విత్తనాలు ఎరువులు పురుగుమందుల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు అయితే ఇదే తరుణంలో స్థానిక సీడ్స్ అండ్ పెస్టిసైడ్ దుకాణాలపై సంబంధిత వ్యవసాయ, విజిలెన్స్ శాఖల అధికారుల నిఘా తనిఖీలు పూర్తిగా శూన్యమవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు నాసిరకం పురుగుమందులు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు.తనిఖీలు లేకుంటే రైతులకు కోలుకోలేని దెబ్బప్రతి సంవత్సరం రైతులు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి మరీ విత్తనాలు, మందులు కొనుగోలు చేస్తుంటారు ఒకవేళ విత్తనాలు నాణ్యంగా లేకపోతే మొలక శాతం ఘోరంగా తగ్గిపోతుంది.పంట ఎదుగుదల లోపించి, ఆశించిన దిగుబడులు రావు.పెట్టుబడి కూడా దక్కక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సీజన్ ప్రారంభంలో నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి దుకాణాల్లోని నిల్వలు, బిల్లులు, లైసెన్సులు, ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించాలని నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు

**డీలర్లు ఈ నియమాలు పాటించాల్సిందే**
సీడ్స్ అండ్ పెస్టిసైడ్ షాపుల యజమానులు కేవలం లాభార్జనే ధ్యేయంగా కాకుండా నైతిక బాధ్యతతో వ్యవహరించాలి.ముఖ్య గమనిక ప్రభుత్వ గుర్తింపు మరియు లైసెన్స్ కలిగిన కంపెనీల ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలి ప్రతి కొనుగోలుపై రైతుకు ఖచ్చితమైన బిల్లు ఇవ్వాలి నిల్వలో ఉన్న విత్తనాలు, పురుగుమందుల గడువు తేదీలను నిరంతరం పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**రైతులూ అప్రమత్తంగా ఉండండి**
నకిలీల బారిన పడకుండా ఉండాలంటే రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి వివరాల పరిశీలన విత్తన ప్యాకెట్లపై ఉన్న కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ (ఇలీజూతితీఎ ఆజీబివ), మరియు మొలక శాతం ) వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
పక్కా బిల్లు కొనుగోలు చేసిన ప్రతిదానికి దుకాణదారుడి సంతకంతో కూడిన పక్కా రశీదు/బిల్లును అడిగి తీసుకోవాలి ఇది భవిష్యత్తులో నష్టపరిహారం పొందడానికి కీలకమైన ఆధారం.ఫిర్యాదు విత్తనాలు లేదా మందుల నాణ్యతపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

**రైతుల శ్రమ వృథా కాకుండా చూడాలి**
రైతే దేశానికి వెన్నెముక ఆ వెన్నెముకను విరిచే నకిలీ విత్తనాలు నాసిరకం పురుగుమందుల వ్యాపారులపై అధికారులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది వ్యవసాయ శాఖ విజిలెన్స్ బృందాలు క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేస్తేనే అన్నదాతకు న్యాయం జరుగుతుంది లేనిపక్షంలో ఈ రబీ సీజన్ లో నకిలీల ముప్పు కారణంగా రైతాంగానికి తీరని నష్టం వాటిల్లే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## యర్రకుంట తండా రైతుల తాళ్లబాటకు
# కొత్త రూపురేఖలు

**చింతలపాలెం(జనంసాక్షి)**
చింతలపాలెం మండలం,యర్రకుంట తండా గ్రామంలోని రైతుల తాళ్లబాట దారిని నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ ద్వారా లభించే మట్టితో మార్గాన్ని సిద్ధం చేసి ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి తెలిపారు.ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రైతులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ కార్యకలాపాలు మరింత సౌకర్యవంతంగా మారనున్నా యని,రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభు త్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో యర్రకుంట తండ కాంగ్రెస్ నాయకు లు భూక్య బాల,గుగులోత్ నాగరాజు, ధీరావత్ పెద్దు,వాంకుడోత్ సైదులు,కొర్ర చందు,భూక్య రమేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు,రైతులు తదితరులు పాల్గొ న్నారు.





## 14 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి
### - ఐద్వా రాష్ట్రకమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి

**మునగాల, జూన్ 14(జనంసాక్షి):**
రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని ఐద్వా రాష్ట్రకమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజల జీవితం భారంగా మారిందని, కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలవల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆమె విమర్శించారు. పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరలు పదే పదే పెంచడం, రవాణా చార్జీలు, కూరగాయల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెలు ఇలా అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, బియ్యం మాత్రమే కాకుండా పప్పులు వంటనూనె చక్కెర ఉప్పు కందిపప్పు సబ్బులు తదితర 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలు, కార్మికులు, వృద్ధులు, నిరుద్యోగులు పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ కజాబి, జ్యోతి, సరిత, వెంకట రమణ, రాములమ్మ, రేణుక, నాగమణి, ఈదమ్మ, నవ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్ల మండల అధ్యక్షులుగా గొడ్డేటి సత్యం

**వలిగొండ, జున్ 14( జనంసాక్షి)**
వలిగొండ మండల ఉపసర్పంచ్ల కమిటీని మండలంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురకంటి శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గొడ్డేటి సత్యం, ఉపాధ్యక్షులుగా వడ్డేమాను దేవేందర్, పెద్ద బోయిన చంద్రకళ, శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శులుగా మలుగ మాధవి, అంబటి సాయికుమార్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మిాసాల నరేష్, కార్యదర్శిగా పల్లపు శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా కుసంగి రాములు, కోశాధికారిగా ప్రశాంత్, గౌరవ సలహాదారులుగా సల్ల ఐలయ్య, బి శ్రీనివాస్, రావుల ధనమ్మ పద్మ రెడ్డి, పసుల బాలస్వామి ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## భక్త మార్కండేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక
## నూతన ఛైర్మెన్ గా సంగెం గణేష్

నాంపల్లి, జూన్ ,14(జనం సాక్షి)
మండల కేంద్రంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఆదివారం గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్, దేవాలయ మాజీ ఛైర్మన్ కోట రఘునందన్, కుల పెద్దల సమక్షంలో దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులుగా నక్క భువనేశ్వర్, అధ్యక్షుడిగా సంగెపు గణేష్, ఉపాధ్యక్షుడిగా పిల్లలమర్రి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంజి సంజీవ్, కోశాధికారిగా తిరందాసు లక్ష్మణ్, కార్యదర్శులుగా కర్నాటి సాంబశివ, రుద్ర వెంకటేశ్వర్లు ,కార్యవర్గ సభ్యులుగా వింజమూరి సురేందర్, గుర్రం మల్లికార్జున్, కర్నాటి మధు, పులిపాటి గణేష్ ఎన్నిక కాగా, గౌరవ సలహాదారులుగా కోట వెంకటయ్య, కోట అయోధ్య, నక్క మురళి నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి గ్రామ పెద్దలు, నక్క చంద్రమౌళి,నక్క రవీందర్, గుర్రం శ్రీరాములు, భరతయ్య,,బిక్షమయ్య, పున్న కోటేశ్వర్, కర్నాటి శ్రీహరి, గుర్రం వెంకటేశ్వర్లు, గణేష్,గోలి కృష్ణ ,సంగెపు లక్ష్మణ్ ,మల్లేష్, పద్మశాలి సంఘ ప్రతినిధులు మరియు యువకులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

# పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతిభ పరీక్షలు దోహదపడుతాయి

**సూర్యాపేట(జనంసాక్షి):**
పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతిభ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని శ్రీ సాయి వైష్ణవి సైనిక్ అకాడమీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో మూడు నుంచి ఆరు తరగతి విద్యను అభ్యసించే చిన్నారులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్ ఫోన్ లకు పరిమితం చేయకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చదువు పట్ల ఏకాగ్రత, శ్రద్ధ వహించాలని అన్నారు. క్రమ శిక్షణతో ఉండే పిల్లలు విద్యా పట్ల ఆసక్తి పెంచు కుంటారని, తద్వారా లక్ష్యాన్ని ఏర్పరుచు కుం టారని పేర్కొన్నారు. ప్రతిభ పరీక్షలో ప్రథమ బహుమతిని గెలుచుకున్న ఎస్.వీక్షిత్ కు, ద్వితీయ బహుమతి ఎం. మౌర్యకు, తృతీయ బహుమతి వి.మోక్షీత్ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్ఐ జానకీరాములు, ఉపాధ్యాయులు సునీల్ రెడ్డి, ఆర్ కె, ప్రతిభ పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 12 ఏళ్ల కాలంలో ప్రధాని “మోడీ” సాధించిన విజయాలను ప్రచారం చేయాలి

- ఉజ్వల, సడక్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలేన్నో ప్రవేశం
- రాష్ట్రంలో బిజెపి జెండా ఎగిరేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- విలేకరుల సమావేశంలో ఉదయ్ ప్రతాప్, బైరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. (జనంసాక్షి):**
జనం సాక్షి 12 ఏళ్ల కాలంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధించిన విజయాలు దేశాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లారు అనే అంశాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ఇన్చార్జి ఉదయ్ ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారంభారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేయుచున్న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రామలింగేశ్వర రావు సమక్షంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో ఆయన మాట్లాడారు. 12ఏళ్ల కాలంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధించినటువంటి విజయాలు, దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాయన్నారు. కేంద్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో, అలాగే జిల్లాలో అధికారమే లక్ష్యంగా బిజెపి శ్రేణులు పని చేస్తామని పేర్కొన్నారు. అయితే భద్రాచలం రోడ్, సత్తుపల్లి రైల్వే లైన్ పని పూర్తి చేసిన ఘనత కేంద్రంలో ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానిదేమన్నారు. అన్నారు. అంతేగాక ఉజ్వల యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా స్టాండప్ ఇండియా తదితర పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కూడా ప్రధానమంత్రి మోడీదేనని వివరించడం జరిగింది. మరి ముఖ్యంగా ఈ యొక్క తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అనే ఒక పథకాన్ని అమలు పరచడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల శ్రీ రాముడి దేవాలయ అభివృద్ధికి రు.98 కోట్ల ఖర్చు చేసిన ఘనత కేంద్రంలో బిజెపి ప్రభుత్వానిదేనన్నారు. అంతేగాక మోడీ చొరవే నని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి గానీ ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. భద్రాచల శ్రీ రాముని ఆలయ అభివృద్ధిని పట్టించుకున్న పాపాన లేదని విమర్శించారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతమైనటువంటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి కేంద్ర ప్రభుత్వం గత పాలకుల కంటే కూడా ఎంతో ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. ఇదే ఉమ్మడి జిల్లాకు సంబంధించి ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా జిల్లాకి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా అదే పనిగా భారతీయ జనతా పార్టీని విమర్శిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో చిన్నారిపై ఒక ముస్లిం యువకుడు దారుణానికి వడిగడితే కనీసం స్పందించడానికి మనసు రాని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వంలో పని చేస్తున్న మంత్రులని తీవ్రస్థాయిలో విమర్శించారు కేవలం ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి అని మంత్రులు ఎవరు కూడాను నోరు మెదపని పరిస్థితి అని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమే కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజల సంక్షేమాన్ని, దేశ అభివృద్ధిని, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసారని ఆరోపించారు. ముఖ్యంగా బీజేపీని విమర్శించే ప్రభుత్వాలు ఏ విధంగా అధికారానికి దూరమయ్యాయో వివరించారు. ముఖ్యంగా రాబోవు రోజులలో భారతీయ జనతా పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, భోగి కృష్ణ, పుణ్యం బిక్షపతి, కార్యదర్శులు తుంపూరిశివ, పుణ్యా నాయక్, ఎస్ఐఆర్ కన్వీనర్ మోహనకృష్ణ,మీడియా కన్వీనర్ రామారావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులకనుగుణంగా పంటలు సాగు చేయాలి

### రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

**భద్రాచలం జూన్ 14 (జనంసాక్షి)**
రాష్ట్రంలో జూన్ 8 వ తేదీనే రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ అవి ఇంకా పూర్తిస్థాయిలో విస్తరించకపోవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ వ్యవసాయ అధికారులు జిల్లా రైతులకు సూచిస్తున్నారు. పొలాల్లో అధిక తేమ లేకుండా నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, నేలలో తగిన తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. జిల్లా రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను శుభ్రపరచి వర్షపు నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని, పశువులను కూడా అక్కడ ఉంచరాదని రైతులను హెచ్చరించారు. వేరుశనగ, సోయాబీన్, జొన్న, పెసర, కంది, మినుము వంటి పంటల విత్తనాలను విత్తే ముందు శాస్త్రీయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా ప్రారంభ దశలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వరి నారుమళ్ల కోసం నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, తెలంగాణ సోనా ఆర్ఎన్ఆర్-15048 వంటి అధిక దిగుబడి రకాలను వినియోగించాలని సూచించారు. వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని సాగు పనులు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాఖ పేర్కొంది.

## పారిశుద్ధ్యం సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 14 ( జనం సాక్షి )**
వర్షాలు కురిస్తే ఖమ్మం నగరం మొత్తం మురుగునీటితో అపరిశుభ్రంగా మారుతుంది. అధికారులు ముందస్తుగా వర్షపు నీరు రోడ్లపై ఆగకుండా తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ( ఎంఎల్ )మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ నగర కార్యదర్శి శోభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.
ఈరోజు స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఖమ్మం నగర కమిటీ సమావేశం కామ్రేడ్ బొల్లి కొమరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని సుమారు 60 డివిజన్లో పారిశుధ్య సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని మరి ముఖ్యంగా విలీన గ్రామాల్లో డ్రైనేజ్ సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు వస్తే నీరు నిల్వ ఉండి దోమలు అభివృద్ధి డెంగి జరాలు వచ్చే ప్రమాదం ఉన్నందున మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ పారిశుద్ధంపై దృష్టి పెట్టి ప్రజలను అనారోగ్యం నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. ఆ దరఖాస్తులను విచారణ జరిపించి అర్హులైన వారందరికీ పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్ లో మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య ప్రయత్నం చేసిన గౌస్ ను కఠినంగా శిక్షించాలని ఆ పేద కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరినారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ నాయకులు కే శ్రీనివాస్ భరత్ కంకణాల శ్రీనివాస్ పార్టీ నగర నాయకులు ధరణ్ కృష్ణ సత్తార్ అశోక్ చందు తదితరులు పాల్గొన్నారు.



## నగదు రహిత వైద్యాన్ని వెంటనే అందించాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 14 ( జనం సాక్షి )**
తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ఖమ్మం జిల్లా ఆఫీస్ బెరర్ సమావేశం లో ఈరోజు ఆదివారం జిల్లా అధ్యక్షులు ఎల్ గోపీచంద్ అధ్యక్ష తన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ వి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంప్లాయ్ హెల్త్ కార్డ్స్ కి సంబంధించిన ట్రస్ట్ ను ఏర్పాటు చేయకుండా హడావిడిగా ఉద్యోగుల మరియు పెన్షనర్ల వేతనాల నుండి 1.5% నగదు ని మే నెల వేతనాల నుండి మినహాయించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఏసీ సమావేశంలో నాలుగు రోజులలో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానని ఆసుపత్రులకు మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపి రెండు వారాలు గడిచినను ఈనాటి వరకు ఏ ఒక్క చర్య చేపట్టలేదని ఈ మధ్యకాలంలో ఆసుపత్రి పాలైన వారు స్వంత ఖర్చులత తోటే వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేయడం జరిగింది. సమావేశంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శ్రీ నెల్లూరి వీరబాబు గత నాలుగు నెలలుగా జరిగిన కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టడం జరిగింది అదేవిధంగా బాకీ ఉన్న ఆరు డిఏలను విడుదల చేయాలని పిఆర్సిని వెంటనే ప్రకటించాలని పెన్షనర్ల బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని జూలై 6,7 తేదీన జరిగే సదస్సు జయప్రదంచేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీమతి పి ఝాన్సీ కుమారి,వై రవికుమార్,పి వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శులు వై శ్రీనివాసరావు, కే కుటుంబరావు, అంజయ్య,గణపతి, స్వామి, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, శివ నారాయణ, శ్రీధర్ రావు రామకృష్ణ ఉమేష్ లు పాల్గొన్నారు.



## తెలంగాణా ఉద్యమకారుల ఫోరం మండల నూతన కమిటీ ఏర్పాటు

**కల్లూరుజూన్ 14(జనంసాక్షి)..**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కల్లూరు మండల నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. మండల కమిటీ అధ్యక్షులుగా కల్లూరు మండల పరిధిలోని ఎర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు దోమతోటి పకీరు ఎన్నికైనారు. ఆదివారం కల్లూరు మండల పరిధిలో ని చెన్నూరు గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల మండల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ ఎస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ హబీబ్,జిల్లాకార్యదర్శికిన్నెర వెంకట్రావుతదితరులు హాజరై ప్రసంగించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఉద్యమంలో పాల్గొన్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. గౌరవ సలహాదారుగాబాణోత్ రాము జిల్లా సహాయ కార్యదర్శిగా కర్నాటి అప్పిరెడ్డి కల్లూరు మండల అధ్యక్షులుగా దోమతోటి పకీరు ఉపాధ్యక్షులు గంతోటి వెంకటేశ్వరరావు మహమ్మద్ అయూబ్, కార్యదర్శులు బాణోత్ చంద్రమోహన్ పెద్ద బోయిన వెంకటేశ్వరరావు ట్రెజరరీ చల్లా లక్ష్మీనారాయణ ప్రచార కార్యదర్శి తండు రాములు సభ్యులుగా పెనుగొండ శ్రీనివాసరావు వేము రామారావు బీరవెల్లి నాగేశ్వరరావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ఉద్యమకారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన కమిటీ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## నేడు గిరిజన దర్బార్..ప్రజావాణి..

**భద్రాచలం జూన్ 14 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ సబ్కలెక్టరు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులంతా సకాలంలో హాజరై వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించడంతో పాటు వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, సబ్కలెక్టర్ మృణాల్ శ్రేష్టలు పేర్కొన్నారు. ప్రజలు తమ విజ్ఞాపన పత్రాలు, తగిన ధృవీకరణ పత్రాలతో రావాలని కోరారు.

# నేటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

○19వ వార్షికోత్సవానికి ముస్తాబైన సాయిబాబా ఆలయం.. ○మరో షిరిడిగా పేరుగాంచిన చింతపల్లి సాయిబాబా..





**చింతపల్లి, జూన్ 14(జనంసాక్షి)**
కోరిన కోరికలు తీర్చే దైవంగా కొంగు బంగారమై నల్లగొండ జిల్లాలోనే మరో శిరిడి సాయిబాబా మందిరంగా సువిశాల మైన ప్రదేశంలో విరాజిల్లుతున్న ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకలకు ఆలయ కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు... ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో , పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చింతపల్లి మండల కేంద్రంలో గత 19 సంవత్సరాల క్రితం బాబా మందిరాన్ని నిర్మించుకోవడం జరిగిందన్నారు. ఆనాటి నుండి ప్రతి సంవత్సరం బాబా సన్నిధిలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా జూన్ 15 నుండి 17 వరకు ఈ మూడు రోజులు వేలాది మంది భక్తుల నడుమ అత్యంత వైభవోపేతంగా కన్నుల పండుగగా పలు దైవ కార్యక్రమాలతో వార్షికోత్సవం వేడుకలను నిర్వహించేందుకు సర్వం సన్నద్ధం చేశామన్నారు... ఈ దేవాలయం హైదరాబాద్ నాగార్జున సాగర్ రహదారి వెంట చింతపల్లి మండల కేంద్రంలో కొలువుదీరి ప్రతినిత్యం భక్తులకు దర్శనం ఇవ్వడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు. ఈ దేవాలయం దాతల సహకారంతో, దినదినాభివృద్ధి చెందుతుంది. గోశాల ఏర్పాటు చేసుకొని సుమారు 400 కు పైగా గోవులు స్వామి సన్నిధిలో నిత్యం సేద తీరడం ఆ దైవ కృప ఏ అన్నారు. అదేవిధంగా స్వామి సన్నిధిలో ప్రతినిత్యం భక్తులకు కార్యక్రమాన్ని అన్నదానం చేస్తున్నారు, సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవనికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలిపారు.. ప్రతి సంవత్సరం సాయి సన్నిధి వార్షికోత్సవం కన్నుల పండుగ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.. వార్షికోత్సవం నేటి నుండి అంగరంగ వైభవంగా జరుపుటకు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఆటంకం కల్గకుండా పూర్తి ఏర్పాట్లు చేసి నట్టు తెలిపారు.15 వ సోమవారం ఉ? 8-00 గం?ల నుంచి సా? 4-00 గం? వరకు మంగళవాయిద్య సంఘోషణ, వేదస్వస్తి, గోపూజ, భూతబలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి, మహా పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, ఆలయ విగ్రహ సంప్రోక్షణ, పంచగవ్య ప్రాశణ వివిధ రకాల కార్యక్రమాలు వున్నాయి. 16వ మంగళవారం సా.4-00 గంటలవరకు గవ్యాంతపూజలు. వాస్తు పూజ వాస్తు హోమ, మన్యు పాశుపత హవనములు. ఆలయ మూలమూర్తులకు. ఏకాదశ రుద్ర అభిషేకములు నీరాజన వివిధ రకాల కార్యక్రమాలు. 17వ తేదిన ఉదయం 11.00గంట లకు లకు వృక్ష కళ్యాణంమన ఆలయంలో లక్ష్మీ నారాయణ స్వరూపమైన వేపచెట్టు - రావిచెట్టుకు కళ్యాణ మహోత్సవం సా?6.00 గం?లకు బ్రమ రాంబ మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మహోత్స వం శ్రీశైల దేవస్థానం నుండి కళ్యాణమూర్తులు, వేదపండితులు విచ్చేసి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసి నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధనంజయ తెలిపారు. ఈ ఉత్సవాలను శ్రీ ముక్కామల పీఠాధిపతి శ్రీ శ్రీధర స్వామి ఆశీస్సులతో, చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ కొడకండ్ల రామశరణ్ శర్మ శైవాగము ప్రతిష్టాచార్య శాసకొండ శివ కిరణ్ శర్మ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సాయంత్రం 7 గంటలకు చింతపల్లి పురవీధులలో శ్రీ బ్రమరాంబ మల్లికార్జున స్వామి, సాయినాధుల వారి ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవోపే తంగా జరుగును. ఘనంగా విద్యుత్ దీపాలతో నిర్వ హించడానికి ఏర్పాటు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు, స్వామి వారి సేవల లో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నారు.



## ఖమ్మం బాధితురాలికి న్యాయం చేయాలి

**కోదాడ,( జనంసాక్షి):** ఖమ్మంలో మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టి, అనంతరం భవనంపై నుంచి కిందికి తోసేసిన నిందితుడు ఎండీ గౌస్‌ను తక్షణమే కఠినంగా శిక్షించాలని కోదాడ రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో రజక సంఘం నాయకులు అత్యవసరంగా సమావేశమై బాలికపై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నచిన్నారిని రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే పరామర్శించాలని కోరారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, వారికి న్యాయం జరిగేంతవరకు రజక సంఘం పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు పిల్లుట్ల కృష్ణయ్య, సట్టు నాగేశ్వరరావు, దాచేపల్లి స్వామి, పిల్లుట్ల శ్రీను, సట్టు ఎల్లయ్య, వీరయ్య, కోటయ్య, రాంబాబు, నాగేంద్ర, లింగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఎర్ర హరికిషన్ కు బాలికా చైతన్యశ్రీ బిరుదుప్రదానం

**తుంగతుర్తి జూన్14(జనంసాక్షి)**



మండల కేంద్రానికి చెందిన క వి రచయిత డాక్టర్ ఎర్ర హరికిషన్ సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఉషోదయ సాహిత్య సేవా సంస్థ శ్రీకాకుళం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్లైన్ పోటీల్లో పాల్గొనీ బాలిక చైతన్యశ్రీ బిరుదు పొందినట్లు తెలిపారు, ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాల కార్మిక దినోత్సవ కవిత పోటీల్లో నిర్వహించిన ఆన్లైన్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు, ఇట్టి పోటీల్లో బాలికే జగతి లో బంగారు భవిత అనే శీర్షికలో చక్కటి సీసా పద్యం రాసినందుకు అభినదిస్తూ నిర్వాహకులు బాలికా చైతన్య శ్రీ బిరుదు ను ప్రదానం చేస్తూ ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపారు, ఈయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు అనేక రచనలు, కవితలు ప్రచురించి ఉత్తమ కవిగా రచయితగా పేరు పొందారు, బిరుదు పొందడం పట్ల ఉపాధ్యాయులు మేధావులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## మల్లపురాజపల్లి లో తల్వారు తాత కు ఘనస్వాగతం

నాంపల్లి,జూన్ 14 (జనం సాక్షి)
మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం లక్ష్యంగా తల్వార్ తాత , తల్వార్ తాత టీం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్ర 18వ రోజు ఉదయం విజయవంతం గా కొనసాగింది. యాత్ర లో భాగంగా నేడు నాంపల్లి మండలం, మల్లపురాజపల్లి గ్రామానికి చేరుకున్నారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులను కలిసి పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. తల్వార్ తాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్య, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు రోడ్డు భద్రతపై కూడా ప్రజలకు సందేశం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంటిపల్లి మణిమాల శ్రీశైలం పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



# అంగన్వాడీలకు జీతాల్లేవు

○మహిళలను కోటీశ్వరులను చేస్తారా..!
○అప్పుల పాలవుతున్న అంగన్వాడి సిబ్బంది
○అంగన్వాడీలకు జీతాలు పెంచి వెంటనే చెల్లించండి
○కేతావత్ బీల్యా నాయక్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు

**దేవరకొండ, జూన్ 14(జనం సాక్షి )**
రాష్ట్రంలో అంగన్వాడీ సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకుడు కేతావత్ భిల్యా నాయక్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 వేల మంది అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు తమ వేతనాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. మహిళల సంక్షేమం గురించి గొప్పగా మాట్లాడే ప్రభుత్వం, మహిళా ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించలేకపోవడం దాని వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడీల సేవలను గుర్తించి వారి హోదాను ఉన్నతీకరించడంతో పాటు వేతనాలను గణనీయంగా పెంచిందన్నారు. 2014లో అంగన్వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, హెల్పర్లకు రూ.2,200 మాత్రమే వేతనం ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీచర్ల వేతనాన్ని రూ.13,650కు, మినీ అంగన్వాడీ టీచర్లు మరియు హెల్పర్ల వేతనాలను రూ.7,800కు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన అభయహస్తం మేనిఫెస్టోలో అంగన్వాడీ టీచర్ల వేతనాలను రూ.18 వేల వరకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆ హామీల అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో



పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సిబ్బంది సమయానికి వేతనాలు అందక కుటుంబ పోషణలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన పరిస్థితుల్లో జీతాలు ఆలస్యం కావడంతో వారి సమస్యలు మరింత పెరిగాయని అన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ సిబ్బంది వేతనాలను విడుదల చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని, అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కేతావత్ భిల్యా నాయక్ డిమాండ్ చేశారు.

# అంబులెన్స్ లోనే ప్రసవించిన మహిళ

**శాలిగౌరరం, జూన్ 14,(జనంసాక్షి):**
నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన మేరీ (23) అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం ఇచ్చారు.ఈ విషయం తెలుసుకున్న శాలిగౌరారం అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి హేమంత్ ,పైలట్ యాదగిరి వెంటనే స్పందించి చిత్తలూరు గ్రామానికి చేరుకొని గర్భిణిని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పెర్కకొండారం గ్రామం వద్దకు రాగానే గర్భిణికి పురిటినొప్పులు వచ్చాయి.దానితో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ హేమంత్, పైలట్ యాదగిరి సహాయంతో ఈ.ఆర్.సి.పి డాక్టర్ల సూచన మేరకు సుఖ ప్రసవం చేశారు.గర్భిణీ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది, తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అనంతరం తల్లి బిడ్డను నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సకాలంలో స్పందించిన సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులు, వైద్య సిబ్బంది,గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.





# బాధితురాలు కుటుంబానికి చేయూత

**హుజూర్‌నగర్, (జనంసాక్షి):**
పట్టణంలోని 15వ వార్డుకు చెందిన రోజువారీ కూలీ మహిళ కుడితొట్టి విజయరాణి వంట పనులు చేస్తూ తీవ్రంగా గాయపడిన ఆమెను ఆదివారం 15 వ వార్డు కౌన్సిలర్ నల్లగొండ సుజాతచంటి, 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవితబాబురావు లు పరామర్శించారు. కుడితొట్టి విజయరాణి వంట పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. విధుల్లో భాగంగా వంట చేస్తున్న సమయంలో అన్నం గిన్నెను దించే క్రమంలో చేతులు జారిపోవడంతో వేడి గంజి రెండు కాళ్లపై పడింది. దీంతో ఆమె రెండు కాళ్లు తీవ్రంగా కాలిపోవడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. కౌన్సిలర్లు ఆసుపత్రికి వెళ్లి విజయరాణి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆమెకు రూ.25,000 ఆర్థిక సహాయంతో పాటు 25కిలోల రైస్ బ్యాగ్ ఇచ్చారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం తమ బాధ్యత అని వారు పేర్కొన్నారు. బాధితురాలు త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోల్లపూడి దయాకర్ , కుడిచెట్టి ఇర్మియ, కోల్లపూడి కళ్యాణ్, వాగ్దేవరావు, అలవాల ఉపేందర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.శరత్ మాక్సి లేజర్ కంటి ఆసుపత్రి వరంగల్ వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు,అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రక్తదానం ప్రాణదానం తో సమానం సామాజిక వేత్త డాక్టర్ మునీర్



**జనంసాక్షి, మిర్యాలగూడ :**
రక్తదానం ప్రాణదానం తో సమానమని ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుంది అని సామాజిక వేత్త డాక్టర్ మునీర్ అన్నారు. ఆదివారం నాడు రుద్ర బ్లడ్ సెంటర్ లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు అయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాతలను ప్రోత్సహించే విదంగా రుద్ర బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు ప్రదీప్, గణేష్, మధు లు వారిని సన్మానించడం అభినందనీయమని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు రక్తదానంపై అవగాహన ఏర్పరచుకుని రక్తదానం చేసి దేశవ్యాప్తంగా ఉన్న రక్త కొరతను నివారించాలన్నారు. అలాగే ప్రభుత్వం నిరంతర రక్తదాతలను గుర్తించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో జనయేత్రీ, ఫ్రెండ్స్, మేధ ఫౌండేషన్, సేవా, ఫాతిమా సొసైటీ తదితర స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజు తగ్గించాలి

**●డివైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ డిమాండ్**

**మునగాల, జూన్ 14(జనంసాక్షి):**
ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజు తగ్గించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు బచ్చలకూర సురేందర్, గడ్డం వినోద్ ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగస్తుల ప్రాసెసింగ్ ఫీజును 2 వందల నుండి వెయ్యి రూపాయలకు పెంచడంతో నిరుద్యోగులపై తీవ్రమైన భారం పడుతుందని అన్నారు. తక్షణమే పెంచిన ఫీజును తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వట్టెపు సైదులు, మామిడి గురుమూర్తి పాల్గొన్నారు.



# ప్రముఖ కవి బుక్కా సత్యనారాయణకు పురస్కారం

**ఖమ్మం, కార్పొరేషన్, జూన్ 14 ( జనంసాక్షి )**
ప్రముఖ కవి, సాహితీవేత్త వికాస వేదిక సాహితీ సంస్థ గౌరవ అధ్యక్షులు బుక్కా సత్యనారాయణకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి స్వర్ణఖంకనం పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం 2026 పురస్కారాల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో భాగంగా వరంగల్లులో బుక్కా సత్యనారాయణకు ' స్వర్ణ కంకణం ' పురస్కారం ప్రధానం చేశారు. 2016 నుంచి ప్రారంభమైన తన సాహితీ ప్రస్థానంలో బుక్కా సత్యనారాయణ ఎన్నో విశిష్ట పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ కవిగా, సాహిత్యంతో పాటు సామాజిక సేవ చేసి పలు ప్రశంసలు అవార్డు రివార్డులు పొందారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో సూపర్డెంట్ గా పదవి విరమణ చేసిన బుక్క సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర సాధనఉద్యమంలో కీలక పాత్ర వహించారు.ఈ పురస్కారం అందుకున్నందుకు గాను ఖమ్మం జిల్లా కవులు, రచయితలు సామాజిక సేవకులు, దళిత బహుజన నాయకులు వివిద ప్రజాసంఘాల నాయకులు మేధావులు, సత్యనారాయణకు శుభాకాంక్షలు అందించారు. బుక్కా సత్యనారాయణ మరిన్ని పురస్కారాలు అందుకోవాలని, ఖమ్మం జిల్లా ఖ్యాతిని పెంచే విధంగా వారి సాహితీ ప్రక్రియ సాగాలని, అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# లోన్ ఇప్పిస్తామని భార్యభర్తలను మోసం చేసిన సైబర్ నేరగాడు

భద్రాచలం జూన్ 14 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం భగవాన్‌దాస్ కాలనీకి చెందిన భార్య, భర్తలకు లోన్ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసి రూ.52 వేలు కాజేసిన ఘటనపై భద్రాచలం సీఐ నాగరాజుకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానస-నరసింహారావు దంపతులకు లోను అవసరం ఉండటంతో పాటు ఫేస్బుక్‌లో రిలయన్స్ లోన్ సర్వీసు ఉన్న లింక్‌ను సంప్రదించారు. ఈ సమయంలో సదరు వ్యక్తి మీ భార్య పేరుతో రూ.15 లక్షలు లోన్ వచ్చే అవకాశం ఉందని, అందుకు సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు, ట్యాక్స్, ఇన్సూరెన్స్ కింద రూ.52 వేలు ముందుగా చెల్లించాలని కోరారు. దీంతో వారు ఏప్రిల్ 10 నుంచి 14వ తేదీ మధ్యలో విడతలవారీగా రూ.52 వేలు అతని ఫోన్‌కు పంపారు. అనంతరం వీరు ఎన్నిసార్లు సంప్రదించినా ఆ నెంబరుకు ఎన్నిసార్లు ఫోను చేసినా ఎటువంటి సమాధానం రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి 1930 సైబర్‌సెల్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భద్రాచలం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ నాగరాజు సైబర్‌నేరంగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# జేఈఈ అడ్వాన్సుడ్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి సన్మానం

**ఎర్రుపాలెం,జూన్ 14 (జనంసాక్షి):**
మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన బొబ్బిళ్ళ పాటి నాగేశ్వరరావు సువార్త దంపతుల కుమారుడు విక్టర్ పాల్ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 1927 ర్యాంకుతో ఉత్తీర్ణులై ఐఐటి (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాసు) నందు నావల్ ఆర్కిస్టర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించిన బొబ్బిళ్ళపాటి విక్టర్ పాల్ ను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిళ్ళ పాటి బాబురావు ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎన్ చర్చ్ నందు సంఘ పెద్దలచే ఆదివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేద వర్గాలకు సహాయపడాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక పాస్టర్ చోరగుడి అశోక్ కుమార్, బొబ్బిళ్ళపాటి రమేష్, బొబ్బిళ్ళపాటి దేవ సహాయం, వేల్పుల బెంజిమెన్ , బొబ్బిళ్ళ పాటి క్రిస్టఫర్, బొబ్బిళ్ళపాటి విలియం స్థానిక మహిళలు,యువత తదితరులు పాల్గొన్నారు.

# చదరంగంతో జ్ఞాపకశక్తి ఏకాగ్రత పెరుగుతుంది

**జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్**

**సూర్యాపేట (జనంసాక్షి):**
చెస్ ఆడటం వల్ల జ్ఞాపకశక్తితో పాటు ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీష్ కుమార్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో మహావీర్ చక్ర కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ఫిడె రెటెడ్ ర్యాపీడ్ చెస్ సెలెక్షన్స్ -2026 నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో ఎంపికైన వారిని వచ్చే నెల 11, 12వ తేదీలలో హైదరాబాద్ లో ఎల్ఎస్ కె చెస్ అకాడమీ సౌజన్యంతో తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే చెస్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు రూ. 3 లక్షల బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు.ఓపెన్ క్యాటగిరికి కె.ఇందిర, ఎం.రవికుమార్, అండర్- 12 విభాగంలో బి.దక్షిత్, అండర్- 10 విభాగంలో జతిన్ రెడ్డి, అండర్-14 విభాగంలో అఖిలేష్, చిద్విలాసిని ఎంపికైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ వెంకట మురళీ,ఉపాధ్యక్షులు సాయికుమార్,జాయింట్ సెక్రటరీ లింగారెడ్డి, ఆర్గనైజర్ అండ్ కోచ్ శ్రీనివాసరాజు, ఎం.రవి కుమార్, మనోజ్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

